ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో సీట్ల భర్తీకి ఐదో విడత నోటిఫికేషన్ విడుదలైనట్టు జిల్లా అడ్మిషన్ల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఆసక్తి గల విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటల్లోగా దరఖాస్తు చేయాలి. రిజిస్ట్రేషన్ ఫారంతో పాటు పదోతరగతి, ఇతర సర్టిఫికెట్లను సమీపంలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 16న సాయంత్రం 4 గంటల్లోగా పరిశీలన చేయించుకోవాలన్నారు. ఈ నెల 17న కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేస్తామ'ని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఇంకా ఎన్నేళ్లీ కష్టాలు?



నిర్వాసిత కాలనీలో నిలిచిన పాఠశాల భవన నిర్మాణ పనులు

- ఆఫ్‌షోర్ రిజర్వాయర్ కాలనీలో కానరాని అభివృద్ధి
- మౌలిక సౌకర్యాలు మరచిన అధికారులు
- నిత్యం ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు
- భూములిచ్చినా.. గౌరవం దక్కలేదని ఆవేదన

పలాస, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్వాసిత కాలనీల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2008లో పలాస మండలం రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ జలాశయం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాగా.. ఆఫ్‌షోర్ జలాశయం కోసం అప్పట్లో భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం మొండిచేయి చూపించింది. నిర్వాసితులకు ఆధునిక హంగులతో లేఅవుట్ వేసి ఇస్తామన్న హామీ నేటికీ అమలు చేయలేదు. కనీస స్థాయిలో కూడా రహదారులు, తాగునీటి వంటి సౌకర్యాలు కల్పించలేదు. రిజర్వాయర్ కోసం భూ సేకరణ చేసి 18 ఏళ్లు పూర్తయినా సమస్యలు మాత్రం అధికారులు పరిష్కరించలేదు. దీంతో నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో సదాశయంతో రిజర్వాయర్‌కు భూములు అప్పగిస్తే తమకు ఇచ్చిన గౌరవం ఇదేనా? అని ప్రశ్నిస్తున్నారు.



నిర్వాసిత కాలనీలో అసంపూర్తిగా ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం

● ఆఫ్‌షోర్ జలాశయం కోసం పలాస మండలంలో రేగులపాడు, నందిగాం మండలంలో శారదాపురం, చిన్నగురువూరు, మెళియాపుట్టి మండలం చీపురుపల్లి గ్రామాలకు చెందిన రైతులు తమ భూములిచ్చారు. ఈ ప్రాంతం ముంపులో ఉండడంతో అధికారులు అప్పట్లో ఆగమేఘాలపై పంట పొలాలు సేకరించి రైతులకు 2013 చట్టం ప్రకారం ఆర్ఆర్ ప్యాకేజీ ప్రకటించారు. దీనిప్రకారం భూములిచ్చిన రైతులకు నష్టపరిహారంతోపాటు ఐదు సెంట్ల నివాసస్థలాలు, గృహ నిర్మాణానికి నిధులు ఇవ్వాల్సి ఉంది. ఇందుకోసం పలాస-కాశీబుగ్గ పురపాలకసంఘం దగ్గరలో ఉన్న రామకష్టాపురంలో భూములు సేకరించి లేఅవుట్ ప్రకారం 250ప్లాట్లు వేసి నిర్వాసితులకు అప్పగించారు. ప్రస్తుతం నిర్వాసిత ప్రాంతంలో శారదాపురానికి చెందిన 109 కుటుంబాలు, చిన్నగురువూరుకు చెందిన 34 కుటుంబాలు, రేగులపాడుకు చెందిన 40 కుటుంబాలు, చీపురుపల్లి గ్రామానికి చెందిన 64 కుటుంబాలు ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చాయి. ఇందులో కొంతమంది గృహాలు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. కాగా అభివృద్ధి పథకాలకు ఏపీడబ్ల్యూఆర్‌డీసీ కింద రూ.5కోట్లు అప్పట్లో ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పనులు ప్రారంభించి పదేళ్లవుతున్నా నేటికి ఒక్క ప్రభుత్వ భవనం పూర్తి చేయలేకపోయింది. రహదారులు, తాగునీరు, విద్యుత్‌సౌకర్యం, పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు, సచివాలయం, డిస్పెన్సరీ (మిగతా 6వ పేజీలో..)



అయ్యో.. 'పాప'ం

- రైల్వేస్టేషన్‌లో బాలికను విడిచిపెట్టేసిన మహిళ
- పలాస చైల్డ్‌లైన్‌కు అప్పగించిన చిరు వ్యాపారులు

పలాస, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బేలచూపులు చూస్తున్న ఈ చిన్నారి(పై చిత్రం) ఏ తల్లి కన్నబిడ్డో. మూడేళ్ల వయసున్న ఈ చిన్నారిని గుర్తు తెలియని ఓ మహిళ మంగళవారం ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా వదిలేసింది. బాలికతోపాటు రైలు ఎక్కేందుకు వచ్చిన ఆమె.. బాత్‌రూమ్‌కి వెళ్లి వస్తానని చెప్పి రైల్వే ప్లాట్‌ఫారంపై ఓ షాపు నిర్వాహకుడికి చిన్నారిని అప్పగించింది. రెండు.. మూడు గంటలైనా ఆమె తిరిగి రాలేదు. చిరు వ్యాపారులు ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వ్యాపారులు అయ్యో పాపం అంటూ ఆ చిన్నారిని పలాస రైల్వేస్టేషన్‌లో ఉన్న చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్లు బాలసరస్వతి, భాగ్యలక్ష్మికి అప్పగించారు. వారు వెంటనే స్పందిస్తు బాలికను సురక్షితంగా శ్రీకాకుళం శిశు గృహానికి తరలించారు. బాలికను విడిచిపెట్టిన ఆ మహిళ ఆచూకీ కోసం వెతుకుతున్నారు. ఒంటరి బాలబాలికలు రైలులో, స్టేషన్ ఆవరణలో తారసపడితే తమకు అప్పగిస్తే వారిని సురక్షితంగా శిశు గృహానికి తరలిస్తామని చైల్డ్‌లైన్ సిబ్బంది తెలిపారు.

పాఠశాలలకు రేటింగ్

- 'స్వచ్ఛ ఏవమ్ హరిత విద్యాలయ్'కు శ్రీకారం
- పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయం
- హరిత, స్వచ్ఛతలో విద్యార్థుల భాగస్వామ్యమే లక్ష్యం

నరసన్నపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మౌలిక వసతులతోపాటు పర్యావరణ పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చేలా కేంద్ర ప్రభుత్వం రేటింగ్ విధానం ప్రవేశపెట్టింది. కేంద్ర మానవ వనరులశాఖ స్వచ్ఛ ఏవమ్ హరిత విద్యాలయ్ రేటింగ్ (ఎస్‌హెచ్‌వీఆర్) విధానాన్ని ఈ ఏడాది ప్రారంభించింది. విద్యార్థుల భాగస్వామ్యమే లక్ష్యంగా.. స్వచ్ఛత, హరిత విద్యాలయాల అంశాల ఆధారంగా ఫైవ్‌స్టార్స్ రేటింగ్ కేటాయించనుంది. ఇందుకోసం పాఠశాలల దరఖాస్తు నమోదు ప్రక్రియ చేపడుతోంది. నిబంధనల మేరకు జాతీయస్థాయికి ఎంపికైన పాఠశాలలకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేయనుంది.

రేపటి నుంచి పరిశీలన

జిల్లాలో 2,955 ప్రభుత్వ, 498 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో పరిసరాలు, స్వచ్ఛత అంశాలు ఆధారంగా ఎస్‌హెచ్‌వీఆర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుకు బుధవారంతో గడువు ముగియనుండగా.. ఇప్పటికే 2,133 పాఠశాలల వివరాలను ప్రధానోపాధ్యాయులు ఎస్‌హెచ్‌వీఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. నీటి వసతి, మరుగుదొడ్ల నిర్వహణ, చేతులు శుభ్రం చేసుకోవడం, పెరటి తోటలు పెంపకం, విద్యార్థుల ప్రవర్తనలో మార్పు, తదితర అంశాలకు సంబంధించిన ఫొటోలు అప్‌లోడ్ చేశారు. సమగ్ర శిక్ష అధికారులు జిల్లాస్థాయిలో ఈ నెల 16 నుంచి నవంబరు 7వరకు వీటిని పరిశీలించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. నవంబరు 8 నుంచి రాష్ట్రస్థాయి బృందం సభ్యులు పరిశీలిస్తారు. డిసెంబరు 14న జాతీయస్థాయి బృంద సభ్యులు పరిశీలించి.. వచ్చే ఫిబ్రవరి 15 తరువాత జాతీయ స్థాయికి ఎంపికైన పాఠశాలలను (మిగతా 6వ పేజీలో..)



ఎస్‌హెచ్‌వీఆర్ విధానంలో భాగంగా చెత్త నిర్వహణ చేపడుతున్న లుకలాం పాఠశాల విద్యార్థులు

ట్రిపుల్ ఐటీకి అరుదైన గౌరవం

- 21 నుంచి క్విస్కిట్ పాల్ ఫెస్ట్

ఎచ్చెర్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అగ్రశేణి విశ్వవిద్యాలయాల్లో జరిగే ఐబీఎం క్వాంటం క్విస్కిట్ ఫాల్ ఫెస్ట్-2025 కార్యక్రమాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఏకైక సంస్థగా ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్(ట్రిపుల్ ఐటీ) ప్రత్యేకంగా ఎంపికైందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మంగళవారం జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ 'శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఈ నెల 21 నుంచి 27వరకు క్విస్కిట్ పాల్ ఫెస్ట్ జరగనుంది. దేశవ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొంటున్నందున తగిన ఏర్పాట్లు చేయాలి. జిల్లా అధికారులంతా సహాయసహకారాలు అందించాలి. ట్రిపుల్ ఐటీకి వెళ్లే రోడ్డు శుభ్రం చేయడం, పారిశుధ్య నిర్వహణ తదితర పనులు చేపట్టాల'ని కలెక్టర్ ఆదేశించారు.

ఉరుముల సమయంలో గ్రానైట్ బ్లాస్టింగ్ వద్దు

- కార్మికులకు బీమా ఉండాలి: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉరుములు, మెరుపుల సమయంలో గ్రానైట్ క్వారీల్లో బ్లాస్టింగ్ చేయరాదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో గ్రానైట్ పరిశ్రమల యజమానులతో ఆయన సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'గ్రానైట్ పరిశ్రమల్లో కార్మికులకు భద్రత, రక్షణ ముఖ్యం. కార్మికుల భవిష్యత్తుకు భరోసాగా గ్రూప్ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలి. గ్రానైట్ బ్లాస్టింగ్ చేసే సమయంలో నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలి. పరిశ్రమల వద్ద వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి. గ్రానైట్ కేంద్రాలను అగ్నిమాపక అధికారుల తరచూ తనిఖీలు చేయాల'ని ఆదేశించారు. కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ దినేష్ మాట్లాడుతూ.. గ్రానైట్ పరిశ్రమలపై కార్మికులకు శిక్షణ కేంద్రం నెలకొల్పేందుకు (మిగతా 6వ పేజీలో..)



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

ఒడిశా టు బళ్లారి

- 30 కేజీల గంజాయి అక్రమ రవాణా
- ఇచ్ఛాపురంలో ఇద్దరి అరెస్టు

ఇచ్ఛాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం పుస్తపూర్ నుంచి కర్నాటక రాష్ట్రం బళ్లారికి అక్రమంగా తరలిస్తున్న 30కేజీల గంజాయిని పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఇచ్ఛాపురంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ మీసాల చిన్నమనాయుడు వివరాలు వెల్లడించారు. కర్నాటక రాష్ట్రం బళ్లారికి చెందిన అంబ్రేష్ తమ్ముడు రాము గంజాయి వ్యాపారం చేస్తున్నారు. అంబ్రేష్ తన ఆర్థిక పరిస్థితి బాగోలేదని రాముకు చెప్పగా, ఒడిశా నుంచి గంజాయి తీసుకొస్తే ప్రతీసారి రూ.10 వేలు ఇస్తానని ఆశ చూపాడు. ఇందుకు అంబ్రేష్ ఒప్పుకున్నాడు. వెంటనే రాము తనకు గంజాయి వ్యాపారంలో సాయంగా ఉన్న రాచకొండ వెంకటసాయిని తోడు ఇచ్చి బళ్లారి నుంచి అంబ్రేష్‌ను రైలులో ఒడిశా పంపించాడు. ఒడిశాలో ఖనుచరణ్ పండా వద్ద గంజాయి కొనుగోలు చేసుకొని బస్సులో ఇచ్ఛాపురం చేరుకున్నారు. అక్కడి నుంచి గంజాయి మూటలతో అంబ్రేష్, వెంకటసాయి కలిసి నడుచుకుంటూ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ వారిద్దరూ అనుమానస్పదంగా (మిగతా 6వ పేజీలో..)



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నమనాయుడు, పోలీసులకు పట్టుబడిన గంజాయి నిందితులు (వెనుక)



రత్తకన్నలో దీపారాధన

ఇచ్ఛాపురం మండలం రత్తకన్న గ్రామం నాయుడువీధిలో గజలక్ష్మి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉత్సవ మండపం వద్ద మహిళలు దీపారాధన చేశారు. శివలింగం ఆకారంలో 501 దీపాలను వెలిగించారు.

- ఇచ్ఛాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి)

దీపావళికి ముందే వెలుగులు

- వీవోఏల మూడేళ్ల కాలపరిమితి జీవో నిలుపుదల
- ఎన్నికల హామీని నెరవేర్చిన ప్రభుత్వం
- జిల్లాలో 1,297 మందికి లబ్ధి
- సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలభిషేకాలు

నరసన్నపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేయడంతోపాటు.. సంఘ రికార్డులను నిర్వహించే విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ల(వీవోఏ)కు కూటమి ప్రభుత్వం తీపికబురు అందించింది. గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడేళ్ల కాలపరిమితిని రద్దు చేసి.. ఎన్నికల హామీని నెరవేర్చింది. దీపావళికి ముందే వారి జీవితాల్లో వెలుగులు నింపింది. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ - వెలుగు పథకంలో వీవోఏలు ఎంతో కీలకం. గ్రామాల్లో పొదుపు పుస్తకాల నిర్వహణలో సంఘాల సభ్యులకు తోడ్పాటు అందించేందుకు సంఘప్రియ పేరుతో చేరి కొంతకాలం ఉచితంగా సేవలు అందించారు. వీరు నెలకోసారి ప్రతి పొదుపు సంఘంతో సమావేశం నిర్వహిస్తారు. గ్రామ, మండల సమాఖ్యల మధ్య వారధిగా పనిచేస్తారు. ఒక్కో గ్రామ సమాఖ్యకు ఒక్కో వీవోఏ బాధ్యత వహిస్తారు. గ్రామ సమాఖ్య పరిధిలో 30 నుంచి 50 వరకు పొదుపు సంఘాలు ఉంటాయి. ప్రస్తుతం గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులతో పొదుపు కట్టించుకోవడం నుంచి వారికి రుణాలు ఇప్పించడంలో రికార్డుల నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తున్నారు. నెలకు సుమారు 15 రోజులపాటు విధులు నిర్వహించే వీవోఏలకు కూటమి ప్రభుత్వం మూడేళ్ల కాలపరిమితి రద్దు చేసి మరింత భరోసా కల్పించింది.



పాతపట్నంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న ఎల్.ఎన్.పేట మండలం వీవోఏలు

● **ఇదీ పరిస్థితి..**

జిల్లాలోని 30 మండలాల్లో 1,297 గ్రామ సమాఖ్యలకు ఒక్కో వీఏవో చొప్పున ఉన్నారు. వీరు మొదట పొదుపు పుస్తకాల నిర్వహణ చేసినందుకు ఆ సంఘం తరపున నెలకు రూ.50చొప్పున తీసుకునేవారు. తర్వాత ప్రభుత్వమే వారికి రూ.2వేల చొప్పున గౌరవ వేతనం ఇచ్చేది. కొన్నాళ్ల తర్వాత దానిని రూ.3వేలకు పెంచింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో గౌరవ వేతనం రూ.8వేలకు పెంచారు. 2019లో అధికారంలోకి (మిగతా 6వ పేజీలో..)

సీఎం చంద్రబాబు రుణం తీర్చుకుంటాం..



డ్వాక్రాసంఘాలను ఏర్పాటు చేసి.. గ్రామాల్లో వీవోఏలకు కొలువులు ఇచ్చారు. గతంలో గౌరవ వేతనం పెంచడమే కాకుండా.. తాజాగా మూడేళ్ల కాలపరిమితిని రద్దు చేసిన సీఎం చంద్రబాబునాయుడు రుణం తీర్చుకుంటాం. వీవోఏల బాధలను గుర్తించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

-గంగు అరుణకుమారి, వీవోఏ సంఘ జిల్లా అధ్యక్షురాలు, ఎచ్చెర్ల

గ్రామాల్లో గౌరవం పెంచారు..



గ్రామ సమాఖ్యలో పొదుపు సంఘాల పుస్తకాలు నిర్వహణ చేసే వీవోఏలకు సీఎం చంద్రబాబునాయుడే గౌరవం పెంచారు. గౌరవవేతనం నిర్ణయించడమే కాకుండా వీవోఏ వ్యవస్థకు గుర్తింపు ఇచ్చారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మరింత ఉత్సహంతో పనిచేస్తాం.

-కోల భాగ్యలక్ష్మి, వీవోఏ సంఘ జిల్లా కోశాధికారి, నరసన్నపేట

ముంగిట పశువులు.. బెంచీలపై శునకాలు

- అపరిశుభ్ర వాతావరణం
- ఇదీ డీఎంహెచ్‌వో కార్యాలయం దుస్థితి



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఉన్న పశువులు



కార్యాలయ ఆవరణలోని బెంచీపై ఉన్న శునకం

అరసవల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అది జిల్లా ప్రజల ఆరోగ్యానికి సంబంధించి పెద్దదిక్కుగా నిలిచే కార్యాలయం. నిత్యం అక్కడి నుంచే జిల్లా ప్రజల ఆరోగ్యానికి సంబంధించి పర్యవేక్షణ ఉంటుంది. అత్యంత ముఖ్యమైన ఆ కార్యాలయంలో అపరిశుభ్ర వాతావరణం రాజ్యమేలుతోంది. అదే డీఎంహెచ్‌వో కార్యాలయం. ఆ కార్యాలయ ఆవరణలో నిత్యం పశువులు సేదతీరుతుంటాయి. కార్యాలయానికి జిల్లా నలుమూలల నుంచి వివిధ పనులపై వచ్చే వారు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బల్లలపై వీధి కుక్కలు విశ్రాంతి తీసుకుంటూ కనిపిస్తాయి. సాక్షాత్తూ డీఎంహెచ్‌వో చాంబర్‌కు వెళ్లే మార్గంలో టైల్స్ పాడైపోయి నడవడానికే ఇబ్బంది పడే పరిస్థితి. ఏళ్లు గడుస్తున్నా సరే అంత చిన్న సమస్యను కూడా సరిదిద్దేందుకు ఎందుకు ప్రయత్నించడం లేదో ఎవరికీ తెలియదు. నిత్యం అదే దారిలో డీఎంహెచ్‌వో కూడా రాకపోకలు సాగిస్తారు. కార్యాలయం లోపలికి ప్రవేశించే మార్గానికి ఎదురుగా పెంటకుప్పను తలపించేలా సామాన్లు చిందరవందరగా కనిపిస్తాయి. కార్యాలయం గోడలు బీటలు వారుతున్నా పట్టించుకోవడం లేదు. కనీసం పాడైపోయిన ట్యూబ్‌లైట్ కనెక్షన్ కూడా బాగు చేసేందుకు ఎవరికీ ఆసక్తి లేకపోవడం గమనార్హం. కార్యాలయానికి సంబంధించిన లిఫ్ట్ ఎప్పుడు పాడైపోయిందో ఎవరికీ తెలియదు. దివ్యాంగులు, వృద్ధులు, రోగులు కాళ్లీడ్చుకుంటూ మెట్లు ఎక్కాల్సిందే. అపరిశుభ్రమైన గోడలతో జిల్లా ఆరోగ్య కార్యాలయం అనారోగ్యానికి చిరునామాగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి... డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



కార్యాలయ ప్రవేశమార్గంలో చెత్తకుప్పలా పడేసిన సామాన్లు



డీఎంహెచ్‌వో చాంబర్‌కు వెళ్లే మార్గంలో దెబ్బతిన్న టైల్స్

లోకానికి కాంతులు.. ఆ ఇళ్లలో చీకట్లు

- మట్టి ప్రమిదలకు తగ్గిన గిరాకీ
- కుమ్మరులకు ఆర్థిక ఇబ్బందులు



మట్టి ప్రమిదలు తయారుచేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగంటే గుర్తొచ్చేది అందమైన ప్రమిదలు.. బాణసంచా వెలుగులు. ప్రమిదలు అందరి లోగిళ్లకు వెలుగులు తీసుకువస్తాయి. కానీ అవి అయారు చేస్తున్న కుమ్మరుల ఇళ్లకు మాత్రం వెలుగులు రావడం లేదు. రాజస్థాన్ పింగాణీ ప్రమిదల కారణంగా మట్టి ప్రమిదలకు గిరాకీ తగ్గిందని... దీంతో తమ బతుకులు కష్టమవుతున్నాయని కుమ్మరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కొత్తపల్లి, సరియాపల్లి, సౌడాం, రేగులపాడు, సీతన్నపేట, నారాయణవలస, చీపుర్లపాడు, దుర్గంపేట, సంతబొమ్మాళి మండలంలోని దండుగోపాలపురం, ఉమిలాడ, పాలతలగాం తదితర గ్రామాల్లో సుమారు 200 కుమ్మర్ల కుటుంబాలు ఉండేవి. కాలక్రమంలో ప్లాస్టిక్ పాత్రలు అందుబాటులోకి వచ్చిన తరువాత మట్టి పాత్రల వినియోగం తగ్గిపోవడంతో వీరంతా జీవనాధారం కోల్పోయారు. దీంతో ఆ కుటుంబాల్లోని వారు అత్యధిక శాతం కూలీ పనులతో పాటు ఇతర వృత్తుల వైపు మళ్లిపోయారు. కొన్ని కుటుంబాలు మాత్రం ఆ వృత్తినే నమ్ముకొని సీజనల్‌గా వచ్చే పండగలపై ఆధారపడి బతుకుబండిని లాగిస్తున్నాయి. మట్టి కుండలు, ప్రమిదలు, మట్టి పొయ్యిలు, తదితర వస్తువులు తయారు చేసి.. కావిళ్లతో ఊరూరా తిప్పుతూ అమ్ముతుంటారు. వీటి ద్వారా వచ్చే కొద్ది మొత్తంతోనే కుటుంబాలను పోషించుకుంటున్నారు.

పింగాణీ జోరు..

సుమారు ఐదేళ్ల క్రితం వరకు దీపావళి సమయంలో మట్టి ప్రమిదలకు మంచి గిరాకీ ఉండేది. ప్రస్తుతం మార్కెట్‌లోకి రాజస్థాన్ పింగాణీ ప్రమిదలు రావ డంతో మట్టి ప్రమిదలు కొనేవారు తగ్గిపోయారు. రాజస్థాన్ ప్రమిదలు ఎంతో ఆకర్షణీయంగా.. వివిధ డిజైన్లతో.. తక్కువ ధరకు వస్తుండడంతో ప్రజలు వాటి వైపే మొగ్గు చూపుతున్నారు. స్థానికంగా తయారు చేసే మట్టి ప్రమిదలను అడిగే వారు లేక కుమ్మర్ల కుటుంబాలు వేరే పాత్రలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రపంచమంతా దీపాల పండుగను సంతోషంగా చేసుకుంటుంటే ఆదాయం తగ్గిపోయిన తమ ఇళ్లలో వెలుగులు కరువవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్వీకుల వృత్తిని వదల్లేం..

మా పూర్వీకులు ఈ వృత్తిని నమ్ముకొని బతికారు. మేమూ ఈ వృత్తిని వదల్లేం. మట్టి వినాయక విగ్రహాలను వాడాలన్న నినాదంలో ఇటీవల వాటికి డిమాండ్ పెరిగింది. అలాగే మట్టి ప్రమిదలు, మట్టి వస్తువుల వినియోగం కూడా పెరుగుతుందనే నమ్మకంతో బతుకుతున్నాం. ప్రస్తుతం కుటుంబమంతా కుండలు, కలశాలు, మట్టిపొయ్యిలు తయారు చేస్తున్నాం. పెట్టుబడికి, యంత్రాలకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలి.

-యండమూరి వెంకటరమణ, దుర్గంపేట, కోటబొమ్మాళి మండలం



మట్టి కుండలను విక్రయానికి తీసుకెళుతూ..

దీపావళికి ముందే 'వెలుగు'లు

(ఐదో పేజీ తరువాయి)

వచ్చిన వైసీపీ ప్రభుత్వం తమ పార్టీ సానుభూతి మహిళలను చేర్చుకునే ఉద్దేశంతో వీవోఏలకు మూడేళ్ల కాల పరిమితిని విధించింది. మూడేళ్ల కాలపరిమితి పూర్తయిన వీవోఏల స్థానంలో కొత్తవారిని నియమించేలా జీవో జారీ చేసింది. దీంతో అప్పట్లో వీవోఏలు జిల్లావ్యాప్తంగా పోరాటాలు చేశారు. కానీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కొన్నిచోట్ల వీవోఏలను తొలగించి తమ పార్టీ సానుభూతి పరులను నియమించింది. దీంతో వీవోఏలు మరింత ఆందోళన చెందారు. తాము అధికారంలోకి వస్తే వీవోఏల మూడేళ్ల కాలపరిమితిని తొలగిస్తామని ఎన్నికల్లో సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఇటీవల ఉత్తర్వులు కూడా జారీ చేయడంతో వీవోఏలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం చిత్రపటానికి పాలభిషేకాలు నిర్వహిస్తున్నారు.



నిర్వాసిత కాలనీలో అధ్వానంగా రహదారి

ఇంకా ఎన్నేళ్లీ కష్టాలు?

(ఐదో పేజీ తరువాయి)

దేవాలయం వంటివి ప్రభుత్వం నిర్మించాల్సి ఉంది. అయితే ఇప్పటివరకూ అరకొరగా విద్యుత్ సౌకర్యం తప్ప మిగిలినవి ఏవీ పూర్తి చేయలేకపోయారు. పాఠశాల, పట్టణ ఆరోగ్య కేంద్రాల భవనాల పనులు మధ్యలోనే వదిలేశారు. 20వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకును నిర్మించినా.. చుక్కనీరు కూడా ఇంతవరకు ఇవ్వలేకపోయారు. రాత్రయితే చాలు నిర్వాసితులు బిక్కుబిక్కుమంటూ బతకాల్సి వస్తోంది. కొండలు, చెరువులు ఉన్న ప్రాంతం కావడంతో విష జంతువులు, సర్పాలు సంచరిస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. కాలువలు లేకపోవడంతో మురుగునీటితో ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోందని చెబుతున్నారు. నీటి కోసం సొంతంగా బోర్లు వేసుకున్నామని, కనీసం తాగునీరైనా తమకు అందించాలని ప్రజలు వేడుకుంటున్నారు. పాఠశాల లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోసంగిపురం గ్రామానికి తమ పిల్లలకు పంపించాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి..

ఆఫ్‌షోర్ నిర్వాసిత కాలనీలో మౌలిక సదుపాయాల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిర్వాసితులను గుర్తించి వారికి స్థలాలు ఇప్పటికే కేటాయించాం. తగిన సౌకర్యాలు ఇంజనీరింగ్ అధికారులు చేపట్టాల్సి ఉంది. దీనిపై చర్యలు తీసుకుంటాం.

-టి.కళ్యాణచక్రవర్తి, తహసీల్దార్, పలాస

పాఠశాలలకు రేటింగ్

(ఐదో పేజీ తరువాయి)

ప్రకటిస్తారు. ఇప్పటికే 90 శాతానికిపైగా నమోదు ప్రక్రియ పూర్తయిందని డీఈవో రవిబాబు తెలిపారు. ఈ నెల 16 నుంచి క్షేత్రస్థాయిలో పరిశీలించి రేటింగ్ ఇస్తామన్నారు. 'పాఠశాలల్లో స్వచ్ఛత, హరిత విధానం అమలుకు సంబంధించి ఆయా అంశాలు 35శాతం కంటే తక్కువగా ఉంటే వన్ స్టార్ ఇస్తాం. 35శాతం నుంచి 50శాతం వరకు ఉంటే టూ స్టార్, 51శాతం నుంచి 74 శాతం మేరకు ఉంటే త్రిబుల్ స్టార్ ఇస్తాం. 75శాతం నుంచి 89శాతం వరకు ఫోర్ స్టార్, 90శాతం నుంచి శతశాతం ఉంటే ఫైర్ స్టార్ రేటింగ్ ఇస్తామ'ని డీఈవో తెలిపారు.

ఉరుముల సమయంలో గ్రానైట్ బ్లాస్టింగ్ వద్దు

(ఐదో పేజీ తరువాయి)

స్థలం కేటాయించాలని కోరారు. ఈ మేరకు పది సెంట్ల స్థలాన్ని కేటాయించాలని ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు. భూగర్భ గనుల శాఖ ఏడీ మోహనరావు మాట్లాడుతూ 'కార్మికులకు బీమా కల్పించాలి. హెల్మెట్లు, తదితర రక్షణ పరికరాలను అందజేయాలి. బ్లాస్టింగ్ చేసే ముందు పోలీసులు, ఆర్డీవోకు సమాచారం అందజేయాలి. బ్లాస్టింగ్ సమయంలో దగ్గరలో ప్రజలెవరూ లేకుండా జాగ్రత్తలు తీసుకోవా'లని తెలిపారు. సమావేశంలో జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణశ్రీ, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి జె.మోహనరావు, శ్రీకాకుళం, టెక్కలి, పలాస, ఆర్డీవోలు, కె.సాయిప్రత్యూష, కృష్ణమూర్తి, వెంకటేష్, డీఎస్పీ వివేకానంద, జియాలజిస్టులు హరకుమార్ నాయుడు, కె.రాము, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఒడిశా టు బళ్లారి

(ఐదో పేజీ తరువాయి)

కనిపించటంతో టౌన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ వి.రవివర్మ తనిఖీ చేశారు. వారివద్ద 30 కేజీల గంజాయి ప్యాకెట్లు పట్టుబడ్డాయి. ఆ గంజాయిని సీజ్ చేసి, వారిద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ చిన్నమనాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రవివర్మ పాల్గొన్నారు.

ప్రజల ఇళ్ల వద్దకే ప్రభుత్వ సేవలు

- రెవెన్యూ ఆరోగ్య విభాగాల్లో వేగం పెంచాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవలను ప్రజల గుమ్మం వద్దకు చేరవేయడమే ప్రధాన ధ్యేయమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి మండల స్థాయి అధికారులతో ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌డీసీ, కేఆర్‌ఆర్‌సీ, పీజీఆర్ఎస్ వంటి రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులు, కోర్టు కేసులు నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. తహసీల్దారులు, ఎంపీడీవోలు ఈ అంశానికి అధిక ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవల్లో నాణ్యత, వేగం పెంచాలని, ప్రజల్లో సానుకూల అభిప్రాయం కలిగేలా పని చేయాలన్నారు. ఈ నెల 18వ తేదీలోగా ఈ-పంట నమోదు ప్రక్రియ శతశాతం చేరుకోవాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధుల నివారణకు వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

పశువుల సంచారాన్ని అరికట్టండి..

శ్రీకాకుళం నగరంలో రోడ్లపై గుంతలు ఉండరాదని... నీరు నిల్వ లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నగరంలో పశువుల సంచారాన్ని అరికట్టాలని ఆయన స్పష్టం చేశారు. పాఠశాలలు, వసతి గృహాల్లో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద 11 గ్రామాలు ఎంపిక య్యాయని తెలిపారు. వాటిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆయన ఆరా తీశారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమానికి సంబంధించిన డాక్యుమెంటేషన్‌ను మొబైల్ యాప్ ద్వారా పకడ్బందీగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రీసర్వే పనులు త్వరగా మొదలు పెట్టాలని స్పష్టం చేశారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ డిమాండ్ ఉన్నచోట వారంలోగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల పిల్లలు

హిరమండలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ హిరమండలంలోని లోకొండ గిరిజన గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు చెందిన 9 మంది పిల్లలను చదివిస్తున్నారు. ఇలా ప్రభుత్వ పాఠశాలలో చదివించడం హర్షణీయమని ఎంఈవో కె.రాంబాబు అన్నారు. మంగళవారం ఎంఈవో ఆ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పిల్లలు వివిధ తరగతుల్లో చదువుతున్నట్టు గుర్తించారు.



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఉపాధ్యాయుల పిల్లలు



ఊరేగింపులో పాల్గొన్న దుర్గా కాలనీ వాసులు

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

పోలాకి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దీర్ఘాశి దుర్గా కాలనీలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచద్రవ్యారాధన, రక్షసూత్రాధారణ, మండపారాధన తదితర కార్యక్రమాలు చేశారు. సాయంత్రం దీర్ఘాశి పురవీధుల్లో బాలికల కోలాటం, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ మహిళలు ముగ్గురాటలు పట్టుకొని ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవాలు మూడు రోజుల పాటు సాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



బీచ్‌లో దెబ్బతిన్న విగ్రహాలు

పూర్వ వైభవం వచ్చేనా?

- రూపు కోల్పోయిన కె.మత్స్యలేశం బీచ్

గార, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కె.మత్స్యలేశం (కళింగపట్నం) బీచ్‌కు పూర్వ వైభవం తేవాలని పర్యాటకులు కోరుతున్నారు. బ్రిటీష్ వారి కాలంలో ఓడరేవుగా వర్తక, వ్యాపారాలతో కళకళలాడిన ఈ ప్రాంతం తర్వాత పర్యాటకులతో కనువిందు చేసింది. అప్పట్లో నిర్మించిన లైట్‌హౌస్ ఇప్పటికీ సేవలను అందిస్తుంది. ఇంతటి చారిత్రక ప్రసిద్ధి చెందిన ఈ బీచ్‌ను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేశారు. దీంతో పర్యాటకుల సంఖ్య బాగా పెరిగింది. రెండు దఫాలుగా ఇక్కడ పెద్ద ఎత్తున బీచ్ ఫెస్టివల్స్ నిర్వహించారు. ఐదేళ్ల కిందట వంశధార నదికి వచ్చిన వరదల్లో బీచ్ రోడ్డుతో పాటు పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన ఏనుగులు, ఒంటె, జిరాఫీ, బుద్ధుడు, ఇతర బొమ్మలు కొట్టుకుపోయాయి. ఫలితంగా బీచ్ తన స్వరూపాన్ని కోల్పోయింది. ఆ తర్వాత బీచ్‌ను సందర్శించే పర్యాటకుల సంఖ్య తగ్గిపోయింది. క్రమేణా బీచ్ వైభవం కోల్పోయింది. ఈ నేపథ్యంలో అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావు బీచ్ కోతను అరికట్టేందుకు రూ.7 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో బీచ్‌లో కొంతవరకు పనులు చేసి అక్కడితో వదిలేశారు. ఆ తర్వాత ఆశాఖాధికారులు ఎటు వంటి చర్యలు తీసుకోలేదు. జిల్లాలో ఎంతో చరిత్ర కలిగిన ఈ బీచ్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని, ఇందుకు కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.



బీచ్‌లో పదేళ్ల కిందట నిర్మించిన పర్యాటక శాఖ వసతిగృహం

సేవలను మెరుగుపరచాలి: అశోక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలను విస్తృతం చేయాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. 'పోషణ్‌మహ'లో భాగంగా ఇచ్ఛాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల చదువుపై శ్రద్ధ కనబరచాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవలు మరింత మెరుగుపడేలా చూడాలన్నారు. కార్యకర్తలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, ఎంపీడీవో ప్రభాకరరావు, ఐసీడీఎస్ పీవో రాజేశ్వరి, ఏఎంసీ చైర్మన్ మణి ప్రకాష్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు బి.హైమ పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి చర్యలు: రవికుమార్



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో ఆదికర్మ యోగి ఫేజ్-1 పథకం అమల్లో భాగంగా బూర్జ, సరుబుజ్జిలి మండ లాల అధికారులు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, సచివాలయ సిబ్బందితో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఆధునిక టెక్నాలజీతో కూడిన సదుపాయాల విస్తరణ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆదివాసీల జీవన ప్రమాణ స్థాయి పెంపొందించడం, విద్య, వైద్య రంగాల అభివృద్ధి రవాణా సౌకర్యాల మెరు గుదల, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించాలని ఆదేశించారు.

చిన్నారి వైద్యానికి రూ.లక్ష సాయం

ఇచ్ఛాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): న్యూమోనియా వ్యాధితో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కొఠారి గ్రామానికి చెందిన పావని కుమార్తె దియా(18 నెలలు) ఆరోగ్యం క్షీణిస్తుండడంతో చిన్నారిని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఓఎస్‌జీ ఫౌండేషన్, వైజాగ్ జీఎస్ ఫౌండేషన్ సంస్థ సభ్యులు రూ.1,00,600 సాయం అందించారు.

ఏడాదిలో 181 ఎక్సైజ్ కేసులు

ఇచ్ఛాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఏడాదిలో 181 కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగంగా మద్యం సేవించిన 12 మందిపై కేసులు నమోదు చేశామన్నారు.

ప్రజల ఆరోగ్యం బాధ్యతగా భావించాలి: ధర్మాన

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం బాధ్యతగా ప్రభుత్వాలు భావించాలని, కాని రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటుపరం చేసి పేదల హక్కులను కాలరాసిందని మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని అరసవల్లి జంక్షన్ వద్ద ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాలను ప్రైవేటు యాజమాన్యాల కిందకు తీసుకెళ్లి విద్యార్థులు, పేదల జీవితాలతో చెలగాటమాడేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజా పోరాటంతోనే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వైద్యం పేరుతో అతి పెద్ద దోపిడీ జరుగుతోందని, దీనికి కూటమి ప్రభుత్వ నిర్ణయం ఊతమిస్తోందని విమర్శించారు.

సమ్మెను జయప్రదం చేయండి

పాత శ్రీకాకుళం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థ పరిరక్షణ, ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి బుధవారం నుంచి నిర్వహిస్తున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు కోరారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో విద్యుత్ ట్రేడ్ యూనియన్ల పోరాట కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, గ్రేడ్-2 కార్మికులకు న్యాయం చేయాలని, పాత పెన్షన్ పద్ధతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యుత్ యూనియన్ నాయకులు శంకర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్సు ద్వారా ఉపాధి పొందాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సును పొందడం ద్వారా ఎస్సీ యువత ఉపాధి పొందాలని డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు కోరారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో హెవీ డ్రైవింగ్ లైసెన్సు దరఖాస్తులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత నెలలో దరఖాస్తులు కోరగా 32 దరఖా స్తులు వచ్చాయన్నారు. వీటిని ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయానికి పంపగా ఎంవీఐ పీవీ గంగాధర్ అభ్యర్థుల నైపుణ్యాలను పరిశీలించారని చెప్పారు. వారిలో 10 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ, ఆర్టీసీ ఒకటవ డిపో మేనేజర్ అమరసింహుడు, ఆర్టీసీ పీఆర్‌వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో భారత్ ముందంజ

గుజరాతీపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భారతదేశం అన్ని రంగాల్లో దూసుకుపోతూ ముందంజలో ఉందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్ర మోహన్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం 'ఆత్మ నిర్భర్ భారత్'పై జిల్లా కార్యశాల సమీక్ష సమావేశం నిర్వహించారు. 'ప్రతి ఇంటా స్వదేశీ.. ఇంటింటా స్వదేశీ' అనేది నినాదమే కాకుండా దేశాన్ని సమృద్ధి, సుసంపన్నత వైపు నడిపించే తారక మంత్రమన్నారు. ప్రపంచ దేశాల నుంచి వివిధ వస్తువులను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ప్రపంచానికే భారత్ వస్తువులను ఎగుమతి చేసే స్థాయికి చేరుకుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడివేణుగోపాల్, నేతలు అట్టాడ రవిబాబ్జీ, ఎస్.ఉమామహేశ్వరి, బిర్లంగి ఉమామహేశ్వరరావు, సూరపునాయుడు, పలువురు నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉమారుద్రుని ఆదాయం రూ.2.42 లక్షలు

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాగావళి నదీతీరంలో గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆదాయం రూ.2,42,968 వచ్చింది. మంగళవారం ఆలయంలో పాలక మండలి చైర్మన్ పాండ్రంకి దేవేంద్రనాయుడు, ప్రధాన అర్చకుడు ఆరవెల్లి శ్రీరామ్మూర్తి శర్మ ఆధ్వర్యంలో హుండీలను తెరిచి లెక్కించారు. 227 రోజులకు 2,42,968 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయ ఎదుగుదల ఓర్వలేక విమర్శలు

ఇచ్ఛాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాజకీయంగా ఎదుగుదల చూసి ఓర్వలేక వైసీపీ, కూటమిలోని కొందరు నేతలు తనపై విమర్శలు చేస్తున్నారని జనసేన నియోజకవర్గ ఇన్ చార్జి దాసరి రాజు అన్నారు. మంగళవారం నివాసంలో తల్లిదండ్రులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. జనసేనలో నా ఎదుగుదలను చూడలేక వ్యక్తిగత విషయాల్లో తలదూర్చి విమర్శలు చేస్తున్నారన్నారు. తల్లిదండ్రులను విడిచి పెట్టి బయటకు రమ్మని భార్య చెప్పడం దాన్ని తాను ఒప్పుకోకపోవడంతో తనపై కక్షపెట్టుకుని కొందరు ఆరోపిస్తున్నారన్నారు. ఎన్ని విమర్శలు వచ్చినా పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాలు, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ముందుకు వెళతానన్నారు.

థర్మల్ ఉద్యమకారుడు గంగాధర్ మృతి



గంగాధర్ (ఫైల్)

సోంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): థర్మల్ పవర్‌ప్లాంట్‌కు వ్యతి రేకంగా చేపట్టిన 2166 రోజుల ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఉద్యమకారుడు సదాశివుని గంగాధర్ అనా రోగ్యంతో మంగళవారం మృతిచెందారు. సోంపేటతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలను చైతన్యం చేసి దీక్ష పూర్తయ్యే వరకు బాధ్యతా పనిచేసిన గంగాధర్ మృతికి పర్యావరణ పరి రక్షణ సమితి, మత్స్యకార ఐక్యవేదిక నేతలు సంతాపం తెలిపి ఆయన భౌతికకాయం వద్ద నివాళి అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సంతాపం వ్యక్తంచేసిన వారిలో ఉద్యమనేతలు వై.క్రిష్ణమూర్తి, బీన ఢిల్లీరావు, సూరాడ చంద్రమోహన్, తెలుకల తిరుపతి, బార్ల సుందర రావు తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

గార, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలో డ్రైనేజీ వాటర్ రీసైకింగ్ ప్లాంట్ ఏర్పాటుకు మంగళవారం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ.3 కోట్లతో ఈ ప్లాంట్‌ను సుమారు 40 సెంట్ల స్థలంలో ఏర్పాటు చేయనున్నారు. స్థల పరిశీలనలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఝాన్సీ, ఏఈ చంద్రకళ, మైగాపు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాంటీన్ నిర్వహణకు దరఖాస్తులు

ఎచ్చెర్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని క్యాంటీన్ నిర్వహణకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవచ్చని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. అడ్డయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా రిజిస్ట్రార్ కార్యాలయంలో అందజేయాలన్నారు. దీనికి సంబంధించి దరఖాస్తు ఫారాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏయూ.ఈడీయూ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. మరింత సమాచారం కోసం రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నేరుగా కాని, లేదా 98662 99401, 99893 40933 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

లావేరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుం దని రణస్థలం ఐసీడీఎస్ పీవో కూన రూపలత అన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసం వేడుకలు మంగళవారం లావేటిపాలేంలో నిర్వహించారు.

పాఠశాల పరిశీలన

కవిటి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాజపురంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర విద్యాపరిశీలకుడు పి. రమేష్ మంగళవారం సందర్శించారు. పాఠశాలలో ల్యాబ్, తాగునీటి సదుపాయాలు, కిచెన్ గార్డెన్, విద్యార్థుల టాయిలెట్స్, లైబ్రరీని పరిశీలించారు. ఎంఈవో-1 ధనుంజయ మజ్జి ఉన్నారు.

అలరించిన సంగీత విభావరి

అరసవల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్ మైదానంలో జీఎస్టీ వారోత్సవాల్లో భాగంగా సిక్కోలు ఉత్సవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం భారతీ రమేష్ సంగీత విభావరి అలరించింది. గాయనీ గాయకులు జానపద, ప్రఖ్యాత సినీ గీతాలను అలపించి సంగీత ప్రియు లను ఓలలాడించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

భరతజాతి ముద్దుబిడ్డ అంబేడ్కర్



బౌద్ధ సమ్మేళనంలో పాల్గొన్న తమ్మినేని తదితరులు

సరుబుజ్జిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భరతజాతి ముద్దుబిడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పాలవలస గ్రామంలో మంగళవారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం దంతపురం బౌద్ధక్షేత్రంలో దమ్మదీక్ష దినోత్సవం, బౌద్ధ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఇండియా మిషన్ ప్రతినిధులు కంఠ వేణు, తైక్వాండో శ్రీను, బుద్ధిస్ట్ సొసైటీ అధ్యక్షుడు హరిబాబు, సామాజిక పోరాట సమితి అధ్యక్షుడు కల్లేపల్లి రాంగోపాల్, గొల్లపల్లి సురేష్, పీఎస్ఎన్‌మూర్తి, కేకే రాజా తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో పోషకాలు వృద్ధి

సరుబుజ్జిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయలో జీవన ఎరువులు వినియోగించడం వల్ల పోషకాలు వృద్ధి చెంది దిగుబడి అధికంగా వస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. కొండవలస గ్రామంలో జీవన ఎరువుల వాడకంపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సస్య పోషణ శాస్త్రవేత్త కిరణ్‌కుమార్, శాస్త్రవేత్తలు బాలకృష్ణ, సునీత, అగ్రికల్చర్ అసిస్టెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పలాస/వజ్రపుకొత్తూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రైలుకిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్‌పీఎస్ ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం పలాస-పూండి రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం 30 నుంచి 35 ఏళ్ల వయసు గల వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఆయన శరీరంపై ఎటు వంటి దుస్తులు లేవు. ఎడమచేతిపై సుశాంత్ అని ఇంగ్లీషులో పచ్చబొట్టు రాసి ఉందన్నారు. మిగిలిన సమాచారం ఏదీ లభ్యం కాలేదన్నారు. వివరాలు తెలిసినవారు 9492250069 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

గాయపడిన మహిళ..

నందిగాం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నర్సిపురం కూడలి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇచ్ఛాపురం మండలం ధర్మపురం గ్రామానికి చెందిన పిట్ట రాధమ్మ(55) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందినట్టు ఎస్ఐ షేక్‌మహ్మద్ ఆలీ తెలిపారు. నర్సిపురం జంక్షన్ సమీపంలో ఆగిఉన్న లారీని టాటామేజిక్ ఢీకొన్న ఘటనలో తొమ్మిదిమందికి గాయపడగా వీరిలో రాధమ్మ మృతిచెందిందన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

పాతపట్నం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గంగువాడ గ్రామానికి చెందిన రావలవలస ధర్మారావు(54) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందినట్టు ఎస్ఐ కె.మధుసూధనరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగువాడ గ్రామానికి చెందిన రావలవలస ధర్మారావు మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం భార్య, భర్తల మధ్య వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. తొలుత గంగువాడ పీహెచ్‌సీకి, అక్కడి నుంచి టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రికి, అక్కడి నుంచి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం వేకువజామున మృతి చెందాడు. ధర్మారావుకి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అస్వస్థతతో వృద్ధురాలు..

సంతబొమ్మాళి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నౌపడ పీహెచ్‌సీలో మంగళవారం సాయంత్రం దుర్గాసి సావిత్రి(63) అనే వృద్ధురాలు అస్వస్థతకు గురై మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. పాతలింగూడు గ్రామానికి చెందిన సావిత్ర నౌపడలోని తన బంధువుల ఇంటికి వచ్చింది. ఒంట్లో నీరసంగా ఉందని మంగళవారం నౌపడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చింది. వైద్యులు సమ్మెలో ఉండడంతో సిబ్బంది ఇచ్చిన టాబ్లెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇచ్చారు. ఇంటికి వచ్చిన ఆమె స్పృహ కోల్పోయింది. వెంటనే ఆమెను బంధువులు వెంటనే ఆసుపత్రికి తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించే లోగా మృతి చెందాయి.

కొట్లాట కేసులో ఇద్దరికి జైలు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఓ కొట్లాట కేసులో ఇద్దరికి మూడు నెలలు జైలు లేదా రూ.వెయి జరిమానా విధిస్తూ విధిస్తూ పలాస కోర్టు న్యాయాధికారి మాధురి మంగళవారం తీర్పు చెప్పినట్టు ఎస్ఐ బి.నిహార్ చెప్పారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. 2016వ సంవత్సరంలో ఒంకులూరు గ్రామానికి చెందిన బడే సరస్వతిపై అదే గ్రామానికి చెందిన దాసరి ధనలక్ష్మి, నండుపల్లి సావిత్రి దాడి చేశారు. సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురుపై కేసు నమోదు చేసి విచారణ పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాలు పూర్తయిన తర్వాత వీరిలో ధనలక్ష్మి, సావిత్రికి శిక్ష పడింది. పీపీ రమేష్ వాద నలు వినిపించినట్టు ఎస్ఐ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు తెలిపారు. కళాశాలలో మేథమెటిక్స్ విభాగంలో ఖాళీ ఉందని, ఈనెల 17వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపాయి. పీజీ చదివి 55శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఈనెల 18వ తేదీ ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.




ఆమదాలవలస: బాణాసంచా కాలుస్తున్న ఎమ్మెల్యే రవికుమార్


అరసవల్లి: బాణాసంచా కాల్చి సంబరాలు చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్


రణస్థలం: రామతీర్థం జంక్షన్ వద్ద సంబరాల్లో పాల్గొన్న ఎంపీ కలిశెట్టి

విశాఖకు గూగుల్ రాకపై సంబరాలు

ఆమదాలవలస/ అరసవల్లి/ రణస్థలం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విశాఖలో గూగుల్ సంస్థ తన కార్యాలయాన్ని ప్రారంభిం చనున్న నేపథ్యంలో సిక్కోలులో సంబరాలు నిర్వహించారు. ● యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ● ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ విశాఖలో ఏర్పాటుకు ముందుకు రావడంతో ఉత్తరాంధ్రలో జోష్ ఏర్పడుతుందని శ్రీకాకు ళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ● విశాఖకు గూగుల్ సంస్థ రాకతో గేమ్ చేంజర్ కానుందని, ఉత్తరాంధ్రలో వేలాది మందికి ఉపాధి దొరుకు తుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, రణస్థలం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు.



ప్రజాభాగస్వామ్యంతో అభివృద్ధి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతో పలాస సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక టీడీపీ కార్యాలయంలో మునిసిపల్, సచివాలయ సిబ్బంది, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన కేవలం 15 నెలల్లోనే కాశీబుగ్గ ఫ్లైఓవర్, కేంద్రీయ విద్యాలయం, వంశధార నీరు, పక్కా రహదారులు తెప్పించుకున్నామన్నారు. గత వైసీపీ పాలనలో ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు , జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణారావు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలో సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో ఆర్థిక స్వావలంబన సాధనకు దోహదపడుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశపు మందిరంలో జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు నిర్వహించారు. నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్ వస్తువులపై పన్నుశాతం తగ్గించడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం కలిగిందన్నారు. కార్యక్రమంలో నియోజవర్గ టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన, రాష్ట్ర పన్నులశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎఎన్‌వీ ప్రసాద్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి బి.భాస్కర ప్రసాద్, పొందర, కాళింగ కార్పొరేషన్ల చైర్మన్లు దామోదర నర్సింహాలు, రోణంకి కృష్ణంనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

జలుమూరు (సారవకోట), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పిల్లలు ఆరోగ్యంగా ఉండేలా చూసుకొనే బాధ్యత ఆయా అంగన్‌వాడీ కార్యకర్తలపైనే ఉందని ఐసీడీఎస్ సారవకోట ప్రాజెక్టు అధికారి సీహెచ్ వంశీప్రియ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం రిమ్స్ వైద్యశాల విద్యార్థులు, పిల్లలు బరువు, ఎత్తు తూకాలపైన అంగనవాడీలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వైద్య విద్యార్థులు పి.తరుణ్‌కుమార్, కొప్పల కుందన, యార్లగడ్డ శ్రావ్య పాల్గొన్నారు.

సంస్కరణల ఫలాలు ప్రజలకు చేరాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలనా సంస్కరణ ఫలాలు ప్రజలకు చేరాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం జరిగిన సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా భవన నిర్మాణ సామగ్రి వస్తు ప్రదర్శనపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ ఏసీ ఏఎన్‌వీ ప్రసాద్, జీఎస్టీ అధికారి ఎన్.శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి ఎం.కిరణ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు బండి రవివర్మ, కూటమి నేతలు పైల బాబ్జీ, శివాల చిన్నయ్యలతోపాటు బిల్డర్లు, ట్రేడర్లు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం


పాతపట్నం/ఎల్ఎన్ పేట అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వీవోఏలకు మూడేళ్ల కాలపరిమితి నిలుపుదల చేయడంపై వారంతా హర్షం వ్యక్తం చేశారు. పాతపట్నంలోని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు క్యాంపు కార్యాలయంలో ఎల్ఎన్ పేట మండల వీఓవోఏలు పెద్ద ఎత్తున చేరుకుని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు చిత్ర పటానికి పాలభిషేకం చేశారు.

ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం

పలాసరూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నాటుసారా అమ్మకాలు, కల్తీమద్యం, గంజాయి వంటి మత్తుపదార్థాలు అమ్మకాలు చేయడం గాని, సేవించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పలాస ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ హౌస్ అధికారి బి.మధుకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి సమాచారం తెలిసినా టోల్‌ఫ్రీ నెంబరు 14405కు తెలియజేయాలని కోరారు.

అవగాహన పెంచుకోవాలి

సంతబొమ్మాళి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయంలో ప్రాణాలు నిలిపే సీపీఆర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని కాస్పా నౌపడ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సీపీఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఆయన మంగవారం మండలం నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులలకు అవగాహన కల్పించారు. అపద సమయంలో ఎంతో ఉపయోగపడే సీపీఆర్ పై అవగాహన పెంచుటకు ప్రభుత్వం ఈ కార్యక్రమం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. 120 అధ్యాపకలు, ప్రిన్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.



వైసీపీ పాలనలోనే కల్తీమద్యం


మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు, సూర్యనారాయణ

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రకరకాల బ్రాండ్ల పేర్లతో కల్తీ మద్యం అమ్మకాలు చేసి వేలమంది ప్రాణాలు పొట్టన పెట్టుకున్నారని టీడీపీ మండల నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జి అరసవల్లి ఉమామహేశ్వరరావు, మాజీ కోఆప్షన్ సభ్యులు నెయ్యిల సూర్యనా రాయణ తదితరులు విలేకరులతో మాట్లాడారు. నాయకులు శాంతమూర్తి, నారాయణ, తదితనేలేవు, అంబటి నారాయణ ఉన్నారు.

కిత్తనారపై అవగాహన

హిరమండలం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస వ్యవసాయ పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో లోకొండ గ్రామానికి చెందిన గిరిజన రైతులకు మంగళవారం కిత్తనారపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త గిడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ కిత్తనార ద్వారా గిరిజన రైతులు ఖాళీగా ఉన్న భూముల్లో వేసుకుని మంచి ఆదాయం పొందవచ్చని చెప్పారు.

